# శ్రీ అమర్ నాథ్

## దర్శన భాగ్యం



గిన్నెల
ప్రమోద్
కుమార్

## ముందుమాట

ఈ రచన, ఒక యాత్రానుభవాల సంకలనం. భారతదేశంలో యాత్రలు అందునా ఆధ్యాత్మిక యాత్రలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. గతకాలంలో కాశీ యాత్ర కష్టమైనదిగా భావించేవారు. ఇప్పుడు అన్ని ప్రయాణ సాధనాలు, వార్తా సాధనాలు వగైరా ఉండడం వల్ల, కాశీ యాత్ర సులభతరమైంది. ఈ కాలంలో కూడా కష్టమైన యాత్రలు ఉన్నాయి. అమరనాథ్, చార్ ధామ్, మానస సరోవరం... ఇలా. కష్టమైనా ఈ యాత్రల వల్ల లభించే ఆనందం, తృప్తి, పారవశ్యం అనిర్వచనీయం.

మిత్రుల సంకల్పం, స్వీయ ఆసక్తి, దైవ బలం, అమ్మానాన్నల, గురువుల ఆశీర్వాదం వల్ల జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని అమర్ నాథ్ హిమలింగ దర్శన భాగ్యం కలిగింది. ఆ విశేషాలను ఈ పుస్తకంలో పొందుపర్చాను.

ఈ యాత్రకు ప్రోత్సహించిన మిత్రుడు **బి. వెంకటేశ్వర రావు** గారికి కృతజ్ఞతలు. అన్ని ఏర్పాట్లు చేసి, మొదటినుండి చివర వరకు మా వెన్నంటి ఉన్న నాందేడ్ వాస్తవ్యులైన **అడ్వొకేట్ దిలీప్ ఠాకూర్** గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

యాత్ర ఆద్యంతం అడుగడుగునా **సెంట్రల్ రిసర్వ్ పోలీస్ ఫోర్స్** వాళ్ళు రక్షణ బాధ్యతలు చూసుకున్నారు వారికి కృతజ్ఞతలు, అదేవిధంగా ఆయా దేవాలయాల ష్రయిన్

బోర్డులు కూడా అన్ని ఏర్పాట్లు చేసాయి వారికి కృతజ్ఞతలు. భవిష్యత్తు లో అమరనాథ్ యాత్ర సంకల్పించిన వారికి ఈ రచన ఉపయోగపడగలదని భావిస్తున్నాను.

- గిన్నెల ప్రమోద్ కుమార్

## తెలంగాణ కాశ్మీరు నుండి...

మా ఆదిలాబాద్ జిల్లా, పచ్చని అడవులు, అందాల జలపాతాలు, ఆలయాలు, ఆదిమ గిరిజన జాతులు, అటు గోదావరి, ఇటు పెన్ గంగ జీవనదులు, మిత్రులు, సన్నిహితులు, ఇరుగు పొరుగు, ఇవన్నీ వదిలి అందాల స్వర్గధామం, భారతమాత కీర్తి కిరీటమైన కాశ్మీర్ కు ప్రయాణం మొదలైంది. ఎంతటి స్వర్గమైనా అందరినీ వదిలి వెళ్లడం... మదిలో ఏదో దిగులు. కానీ భయాలు, ఆందోళనలు, అనుబంధాలు, భాద్యతలు... అన్నిటినీ అధిగమిస్తేనే జీవితానుభవాలు.

హైదరాబాద్ బస్ లో సినిమాలు, మనసు చంచలమైనపుడు ఈ సినిమాలతో కొంత స్థిరత్వం... ఆలోచనలు, ఆలోచనలు లేకుండా ఎప్పుడూ ధ్యానంలో ఉండడం సామాన్యులకు అసాధ్యం, వాటిని అలాగే ఆస్వాదిస్తూ, అధిగమిస్తూ... ఆలోచనలలో అలసి సొలసి, కొంత కునుకు తీసేసరికి హైదరాబాద్ చేరింది బస్సు. బస్ స్టేషన్ బయట ఎదురు చూస్తుండగానే

వచ్చాడు మిత్రుడు కిరీటి.  అన్నీ మరిచి ముచ్చట్లలో మునిగిపోయినం. ఇంటికి చేరుకుని ఆప్తులతో, మిత్రులతో కలిసి యాత్రా తయారీ చేసుకుని రాత్రి హోటల్ లో విశ్రమించాము.

మరుసటి రోజు ఎయిర్ పోర్ట్, నేను, మిత్రులు... జీవితంలో మొదటి విమాన ప్రయాణం... జీవితంలో మొదటి అనుభవాలు ఎంతో విశిష్టమైనవి ఎందుకంటే అక్కడ మనం ఎక్కువ జీవిస్తూ ఉంటాము, ఎక్కువ జాగరూకతతో ఉంటాము, జీవితానికి మరింత దగ్గరగా ఉంటాం. గాలిలో సర్వ మర్యాదలు... ఎమర్జెన్సీ ద్వారాలు,  సీటులో బంధించుకోండి, ఎలాంటి మత్తు పదార్థాలు సేవించకండి, మంచి నీళ్లు కావాలా... ఇవన్నీ పూర్తయ్యేసరికి దేశ రాజధాని రానే వచ్చింది. మబ్బుల్ని చీల్చుకుని దిగుతున్న విమానం కిటికీ లోంచి రోడ్లు, భవంతులు, క్రీడాప్రాంగణాలు.

ఢిల్లీ  ఎయిర్ పోర్ట్... చదువు, పుస్తకాలు, రాజులు, రాజవంశాలు, దేశం, రాజధాని, సరిహద్దులు ఎన్ని తెలిసినా ప్రత్యక్షంగా అదే మొదటిసారి రాజధాని దర్శనం. విమానాశ్రయంలో శుచి, శుభ్రత, క్రమశిక్షణ, అందమైన చిత్రాలు అందులో ఎర్రకోట, కుతుబ్ మినార్...ల చిత్రాలు. శ్రీనగర్ వెళ్లే విమానానికి కొంత సమయం ఉన్నందున, విమానాశ్రయంలో టిఫిన్ ముగించాము. కొంత సేపు సేద తీరి, కాశ్మీర రాజధానికి వెళ్లే విమానం ఎక్కేసాం.

శ్రీనగర్ లో లాండింగ్ అయ్యే ముందు విమానం కిటికీలోంచి శ్రీనగర్ అందాలు,

లోయలు, పర్వతాలు, నదులు, హిమనీనదాలు, మేఘాలు... అత్యద్భుతం. దేవుడు ఇక్కడ విడిగా ఒక లోకం నిర్మించినట్టుగా ఉంది. ఇంకా దిగుతున్న కొద్దీ పొడవాటి చెట్ల మధ్య అక్కడక్కడ ఇళ్లు, వింతగా కనిపించిందేంటంటే పైనుంచి చూస్తే అన్ని ఇళ్ల పైకప్పులు మెరుస్తూ ఉండడం, దానికి కారణం హోటల్ రూమ్ కి చేరిన తర్వాత తెలిసింది.

## శ్రీనగర్ వర్ణన

శ్రీనగర్ విమానాశ్రయం ఒక సైనిక విమానాశ్రయం దానినుండి బయటకు వచ్చి ఒక వాహనంలో హోటల్ కి బయల్దేరాము. ఒక్క ముఖ్యమైన దారి తప్ప శ్రీనగర్ వీధులు దాదాపు ఇరుకైనవి, భద్రత కట్టుదిట్టంగా ఉంది, రోడ్డు పొడవునా రెండువైపులా ప్రతి 100 మీ..లకు ఇద్దరు సైనికులు పహారా కాస్తున్నారు, సైనిక వాహనాలు అడుగడుగునా ఎదురయ్యాయి, పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది అని మాకు అర్థం అయింది, అందునా అమరనాథ్ యాత్ర సమయం. యుద్ధక్షేత్రం లోకి వచ్చిన అనుభూతి కలిగింది అందరికీ, ఈ ఉద్రిక్త వాతావరణానికి తోడు ప్రయాణం లో అలసట పెరసి హోటల్ రూం కి తొందరగా చేరుకోవాలని కోరుకున్నాము అందరం. రాష్ట్ర రాజధాని అయినా పెద్దనగరం కాకపోవడం వల్ల, మిగిలిన పెద్ద నగరాలలా హంగులు ఏవీ శ్రీనగర్లో కనిపించవు. పాదచారులు ఎక్కువే, అలా అని కార్ల సంఖ్య ఏం తక్కువ

లేదు. అన్నీ దాదాపు రెండు మూడు అంతస్థుల పెద్ద భవంతులే రోడ్డు పొడవునా కనిపించాయి, ఆ భవంతులకి ఎత్తైన ప్రహరీ గోడలు, పెద్ద గేట్లు. భవంతులు చాలా సుందరంగా నిర్మించబడ్డాయి. పెద్ద, చిన్న అన్ని భవంతులు కూడా రేకులతో కప్పిన ఏటవాలు పై కప్పులే. శ్రీనగర్ లో తరచూ మంచు కురవడం వల్ల, ఆ మంచు కరిగి కిందకి జారిపోయేలా నిర్మాణాలన్నింటికీ పైకప్పు ఎటావాలుగా ఉండి రేకులతో కప్పబడి ఉన్నాయి. ఈ రేకులే విమానంలో నుంచి చూసినపుడు మెరుస్తూ కనిపించాయి. వీధుల్లో గమనించిన ఒక విషయం ఏంటంటే ఇక్కడి ముస్లిం మహిళలు దాదాపు అందరూ కూడా, వేరే ప్రాంతాల్లోలా నిండుగా నల్లని బుర్ఖా ధరించకుండా కేవలం హిజాబ్ ( ముఖం వదిలి మిగిలిన తల చుట్టూ కప్పుకోవడం) ధరించారు. ఇక్కడ ముస్లిం లు మెజారిటీ, వేరే మతాల వాళ్ళు కానీ, వారి చిహ్నాలు కానీ దాదాపు కనపడలేదు.

వాతావరణం చాలా తక్కువ సమయానికే మార్పులకు లోనయ్యేలా ఉంది. మధ్యాహ్నం కాస్త ఎండ కాసినా, సాయంత్రానికల్లా చల్లని గాలులు మొదలయ్యాయి, కాశ్మీర్లో జులై లోనే చలికాలం మొదలవుతుందని అర్థం అయింది. ఎర్రని రంగు, పొడవాటి మొఖాలు, మంచి పొడవు, కొచ్చటి ముక్కులు.. ఇక్కడి మనుషుల శరీర లక్షణాలు. ఇరుకైన దారులు, కార్లు, చిన్న చిన్న యాత్రా వాహనాలు, అన్ని రకాల దుకాణాలు... మొత్తానికి ఈ కాలం నాటి సాధారణ నగరాల కంటే ఎంతో భిన్నంగా ఉంది శ్రీనగర్.

హోటల్ రూమ్ కి చేరుకున్నాం, ఆ హోటల్ పేరు మాకు చాలా నచ్చింది 'అప్నా ఘర్' (మన ఇల్లు). కొద్దిగా ఫ్రెషప్ అయిన తర్వాత రూమ్ బాయ్ ని పిలిచాం అతని పేరు అడిగితే, వింతగా చెప్పాడు. 'నారాయణ్ ...' ఆ రెండో పదం ఏం చెప్తున్నాడో మాకు అర్థం కాలేదు, బెంగాలీ అబ్బాయి. సాయంత్రం కొద్దిసేపు బయట వీధుల్లో తిరిగాం. కాశ్మీరీ ల భాష భిన్నమైనది, ఏ ఒక్క పదమూ అర్థం చేసుకోలేకపోయాం. ఇక్కడ ఇళ్ళ కిటికీ లకి (పై అంతస్తులో కూడా) ఇనుప గ్రిల్స్ అమర్చలేదు, కిటికీ అద్దాలు బయటి నుండి లోనికి కనబడనివై ఉన్నాయి. ఒక శాలువాల దుకాణంలో కొద్దిసేపు కూర్చున్నాం, ఆ వ్యక్తి చాలా బాగా మాట్లాడాడు. మధ్యాహ్నమే చల్లగా ఈదరగాలి వణికించడం మొదలు పెట్టింది. వీధుల్లో జనాలు గుంపులుగా తిరగడం, మమ్మల్ని వింతగా చూడటం, కొద్దిగా వర్షం మొదలవడంతో తిరిగి రూమ్ కి చేరుకున్నాం.

రాత్రి పది గంటలకు డైనింగ్ టేబుల్ దగ్గర చాలా సేపు ముచ్చట్లు పెట్టుకున్నాం. రోటీ, దాల్, కొద్దిగా రైస్ చేయించుకుని తినేసి పడుకున్నాం.

**శ్రీనగర్ టు బాల్తాల్ క్యాంప్**

నిద్ర లేవగానే రూంబాయ్, బెంగాలీ-హిందీ భాషలో 'పేన్నీళ్లు వస్తున్నాయ్ తొందరగా స్నానం చెయ్యండి' అని చెప్పి వెళ్ళాడు. మిత్రుడు కిరీటి tv ఆన్ చేసాడు, చానెల్స్ పెతగ్గా పెతగ్గా

ఓ పాత హిందీ సినిమా తగిలింది, కొంచెం సేపు చూస్తూ రెడీ అయ్యాం.

ఇక్కడ హిందీ భాష చాలా అవసరం. ఎప్పుడైనా ఎక్కడైనా మాతృభాషే ముద్దు, కానీ ఇంకో భాషా పరిజ్ఞానం ఉండడం అవసరం. భాషకు మన పర భేదాలు ఉండవు, ఆ భాషలు మాట్లాడే మనుషులకే అవన్నీ.

లగేజ్ అంతా తీసుకొని 'అప్నా ఘర్' బయటకి వచ్చి మా వెహికల్ కోసం నిల్చున్నాం. కొంత సేపు హోటల్ బయట లాన్ లో, గులాబీ మొక్కల మధ్య ఫోటోలు తీసుకున్నాం, మా తోటి యాత్రికులైన కొందరు మరాఠీ ఆడవాళ్లు పూర్తిగా అందులోనే నిమగ్నమయ్యారు కొద్దిసేపు. గులాబీ పూలు చాలా పెద్దగా ఆకర్షణీయంగా ఉన్నాయి. వెహికల్స్ వచ్చేసరికి అందరూ లగేజీ సర్దుకుని కూర్చున్నారు. శ్రీనగర్ ఊరవతల ఓ పెద్ద కొండ పక్కన అందరం దిగాము. కొంతసేపటికి రైలు ద్వారా వచ్చిన మిగిలిన యాత్రికులు మాతో కలిశారు. మొత్తం అందరం రెండు మినీ బస్ లలో బయల్దేరాము.

పచ్చని పొలాలు, ఏపుగా (మన టేకు లాగా) పెరిగిన చెట్లు. ఊరు అడవి కొండలు వేరు వేరుగా కాకుండా అన్నీ ఒకటికొకటి కలగలిసి వింతగా ఉంది ఇక్కడ. ప్రకృతి ఒడిలో ఇళ్ళూ, మనుషులు. ఇంతలో బస్ ఆగిపోయింది, రూట్ మార్చుకుని మళ్లీ ప్రయాణం మొదలైంది. ఏమైంది అని విచారించగా ఆర్మీ వాళ్ళు ఖీర్ భవాని శక్తిపీఠ్ మరియు హాజరత్ బల్ దర్గాహ్ కి వెళ్ళడానికి అనుమతించలేదని తెలిసింది. ఎందుకు అని అడిగితే ఒకటే సమాధానం 'మహోల్

ఖరాబ్ హై' (అనుకూల పరిస్థితి లేదు) అంటే వాతావరణం బాలేక పోవచ్చు, కొండచరియలు విరిగి రోడ్డు చెడిపోయి ఉండొచ్చు లేదా తీవ్రవాదుల సమస్య ఉండొచ్చు. మహోల్ ఏదైనా ఇక్కడ సి ఆర్ పి ఎఫ్ వారి అనుమతి ప్రకారం నడుచుకోవడమే ఉత్తమం. మా నిర్వాహకుడు అయిన ఠాకూర్ గారిని అడిగితే, వచ్చేటప్పుడు ఆ ప్రాంతాలు దర్శించుకుందాం అన్నారు. ఠాకూర్ గారు మహారాష్ట్ర నాందేడ్ కు చెందిన వ్యక్తి, ధార్మిక కార్యక్రమాలలో తాను పాల్గొంటూ అందరినీ పాల్గొనేట్లు చేస్తుంటారు.

యాత్రికుల మూడ్ మార్చడానికి ఠాకూర్ గారు అంత్యాక్షరి లాంటి ఒక కార్యక్రమం మొదలు పెట్టారు. చాలా ఆసక్తికరంగా ఉంది ఆ గేమ్, అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు, దాదాపు గంట సేపు వరకు సాగిన ఆటలో తెలంగాణ సోదరి లావణ్య విజయం సాధించింది. మహారాష్ట్ర వాళ్ళందరూ ఎంతో పొగిడారు ఆమెను.

మంచు కొండలు మొదలయ్యాయి. మధ్యలో ఒక చోట ఆగాము, అక్కడ లంగర్ ఏర్పాటు చేయబడి ఉంది అదే 'బాల్తాల్ లంగర్' ఎత్తైన పర్వతాల మధ్య ఉంది ఆ ప్రదేశం. యాత్రికుల కోసం, యాత్రామార్గంలో అక్కడక్కడ ఈ లంగర్ లనబడే ఉచిత భోజనకేంద్రాలు ఏర్పాటు చేయబడి ఉన్నాయి. ఇక్కడ ల్యాండ్ లైన్ ఫోన్ సదుపాయం ఉంది, మొబైల్ సిగ్నల్ లేనందున యాత్రికులందరూ వారి బంధువులతో మాట్లాడారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన దాతలు ఈ లంగర్ లను ఏర్పాటు చేయిస్తారు. ఎన్నో రకరకాల ఆహార పదార్థాలు చేస్తూ

ఉంటారు. బాల్తాల్ లంగర్ లో 'ఉసిరి మురబ్బా' అనే స్వీట్ అందరినీ ఆకర్షించింది. బయట రోడ్డు మీద స్థానిక పిల్లలు రకరకాల పళ్ళు అమ్ముతున్నారు. అన్నీ దాదాపు సేపు (ఆపిల్) జాతికి చెందినవే. యాత్రికులందరూ ఎవరికి నచ్చినవి వారు కొనుక్కుని, కొంతసేపు ప్రకృతిని ఆస్వాదించి మళ్లీ బస్ ఎక్కి కూర్చున్నారు.

దూరంగా, ఎత్తుగా ఉన్న కొండలపై నుంచి కిందకి జారుతూ ఆగిపోయినట్టుగా మంచు. రోడ్డుకు ఒకవైపు సమాంతరంగా స్వచ్ఛమైన నీటితో ప్రవహిస్తూ ఒక నది, అక్కడక్కడా ఇళ్ళు. పర్వతాలపై పచ్చని చెట్లు. యాత్రికులందరూ వారి వారి కెమెరాలలో ఆ దృశ్యాలను పదిలపర్చుకున్నారు. ఇన్ని అందాలకు నెలవైన భారతదేశంలో పుట్టడం మన అదృష్టం. దారి పొడవునా టూరిస్టుల కోసం హోటల్స్ ఉన్నాయి. నదులపై సైనిక ఇంజినీర్లు నిర్మించిన వంతెనలు భిన్నంగా ఉన్నాయి. సూర్యకాంతి మంచుపై పడి ప్రకాశిస్తున్న పర్వత శిఖరాలు...

ఈ ప్రకృతిని దగ్గరగా ఆస్వాదించడానికి యాత్రికులందరు ఎప్పుడెప్పుడు బస్ దిగుదామా అని చూస్తుండగా, శ్రీనగర్ నుండి దాదాపు గంటన్నర ప్రయాణం తర్వాత 'సోన్మార్గ్' లో బస్ ఆగింది. ఇది ఒక వ్యూ పాయింట్, చుట్టూ మంచు పర్వతాలతో స్వచ్ఛమైన వాతావరణంలో ఆ ప్రాంతం అద్భుతంగా ఉంది. ఇక్కడినుండి కార్గిల్ కి వెళ్లే జాతీయ రహదారి (జోజిల్లా పాస్)లో జీరో పాయింట్ (దాదాపు 35 km) అనే ప్రదేశానికి వాహనాలు నడుస్తూ ఉంటాయి. యాత్రికులు గ్రూపులుగా మారి బయల్దేరారు. మేము తెలంగాణ యాత్రికులం ఒక వాహనంలో బయల్దేరాము.

పర్వత అంచుల వెంట ఉంది ఆ రోడ్డు. ఎడమవైపు పర్వత శిఖరాలు కుడివైపు అంతులేని లోయలు. అక్కడక్కడ మంచు కరిగి రోడ్డుపై ప్రవహిస్తూ లోయలోకి జారుతూ, లోయలో మేత మేస్తున్న గొర్రెలు, పర్వతంపై కొంత ఎండ కొంత నీడ, మంచు కింద నుండి అంతర్వాహిణులైన నీటి పాయలు ఆ దృశ్యాలు ఊహకందనివి. ఆ విధంగా మధ్యాహ్నానికి జీరో పాయింట్ చేరుకున్నాం. అక్కడ కొండపై నుంచి ప్రవహిస్తున్న నీరు అంతా మంచుగా మారి ఉంది. స్థానికులు కొందరు చెక్క బల్లల మీద యాత్రికులను పై నుండి కిందికి జారుస్తూ తీసుకుస్తారు, దానికి ప్రత్యేకమైన బూట్లు తొడుగుతారు. అందరం మంచులో కొంత ఎత్తు దాకా ఒకరినొకరు పట్టుకుని చేరుకున్నాం, అక్కడి నుండి చెక్క బల్లల మీద జారడం ఒక అనుభూతి. మంచులో బలహీనంగా ఉన్న పైపొర పగిలిపోవచ్చు, అలా జరిగితే మంచుతో పాటు అందులో పడితే ప్రమాదమే. కొంతసేపు ఆడుకుని, ఫోటోలు దిగేసరికి సూర్యుడు అస్తమించడం మొదలయింది. సాయంత్రం అయినా కొద్దీ చల్లని ఈదరగాలి పెరగడం మొదలయింది. వణుకు మొదలయింది. అందరం తొందరగా వెహికల్ లో వచ్చి కూర్చున్నాం. వచ్చిన మార్గంలో ఘాట్లు అన్నీ దిగి బాల్టాల్ కాంప్ కు బయల్దేరాము. ఒక చోట నది నీళ్లు తాకి చూశాం, తెలంగాణా లో డిసెంబర్ ఆఖర్లో కూడా అంత చల్లగా ఉండవు నీళ్లు. సోన్మార్గ్ నుండి బాల్తాల్ కాంప్ దాదాపు 30 నిమిషాల ప్రయాణం. బాల్తాల్ చెక్ పోస్ట్ లో యాత్రికులందరిని వారి ఐడెంటిటీ కార్డులను, లిస్ట్ ప్రకారం చెక్ చేశారు. కాంప్ కి దూరంగా బస్ లను పార్క్ చేశారు. మొత్తం సామానులను, 'పిట్టు' లనే

మోసేవాళ్లకు అప్పగించి క్యాంపులోకి చేరుకున్నాం. ఆర్మీ వాళ్ళు యాత్రికులను, సామానులను పరిశీలించి లోనికి అనుమతించారు. మా టెంట్ కొంచెం దూరంగా ఉండడం, అప్పటికి విపరీతంగా అలసిపోయి ఉండడం, చీకటవడం వల్ల ఒకరిద్దరు చేరుకోవడం ఆలస్యమైంది. ఠాకూర్ గారు మా గ్రూప్ కి ఒక టెంట్ కేటాయించారు. ఒక్కక్కరికి ఒక్కో మంచం, రెండు పరుపులు, దిండు. అక్కడ చలిని తట్టుకోవలంటే పరుపు కప్పుకోవాల్సిందే. అప్పటికే రాత్రి అవడంతో, దగ్గర్లోని తెలుగు లంగర్ లో భోజనం ముగించుకుని పడుకున్నాము.

## బాల్తాల్ క్యాంప్

బాల్తాల్ క్యాంప్, అమర్నాథ్ యాత్ర మొదలయ్యే ప్రదేశం ఇక్కడి నుండి యాత్రికులు నడుచుకుంటూ, గుర్రాలపై లేదా డోలీలపై పవిత్ర అమరనాథ్ గుహ వైపు బయల్దేరతారు. బాల్తాల్ కాకుండా 'పహల్గావ్' నుండి కూడా యాత్రికులు వెళ్తుంటారు. కానీ అది బాల్తాల్ కంటే కఠినమైనదని అంటారు.

బాల్తాల్ కాంప్ దాదాపు ఒక ఊరంత పెద్దగా ఉంది. యాత్రికులు ఉండడానికి టెంట్లు, లంగర్లు, ఆర్మీ టెంట్లు, రకరకాల వస్తువులను అమ్మే దుకాణాలన్నీ కలిగి ఉంది. CRPF వాళ్లు సదా అప్రమత్తంగా ఉంటారు. ఎక్కడికక్కడ తనిఖీ కేంద్రలుంటాయి. కాంప్ లోకి వచ్చే ప్రతి

మనిషికీ, గుర్రాలు నడిపే వాళ్ళకి కూడా ID కార్డులు ఇవ్వబడతాయి. గుర్రాల వాళ్ళు, డోలీల వాళ్ళు టెంట్ల దగ్గర, లంగర్ల దగ్గర ఎప్పుడూ ఉంటారు, కావాలనుకునే వాళ్ళు మాట్లాడుకోవచ్చును. ఈ సవారీల ధర గుర్రాలు ఒక్కొక్కటి మూడు నుంచి నాలుగు వేల రూపాయలు, డోలీ ఒక్కొక్కటి పది నుంచి పదిహేను వేల రూపాయలు ఉంటుంది. యాత్రికుల రద్దీ ని బట్టి ఇది మారవచ్చు.

క్యాంపులో నీటికి కొదువలేదు, అన్నీ పైపులు, టాయిలెట్స్ మొదలగు తాత్కాలిక వ్యవస్థలు ఏర్పాటు చేయబడి ఉన్నాయి. టెంట్లు అన్నీ వేరు వేరు ఆకారంలో రంగుల్లో ఉండి కాంప్ ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడ రాత్రి కంటే పగలు ఎక్కువ, రాత్రి 8 దాటినా వెలుగు ఉంటుంది. చుట్టూ ఎతైన కొండలు, ఆ కొండల్లో దూరంగా రోడ్లు, రోడ్లపై ప్రయాణించే వాహనాలు కాంప్ నుండి చాలా చిన్నగా కనిపిస్తాయి. రాత్రిపూట ఆ దృశ్యం మరింత అందంగా ఉంటుంది.

## మంచులింగం దర్శనం

మంచు లింగం దర్శించుకునే రోజు వచ్చింది. ఆ ప్రాంతంలో రాత్రి ఉష్ణోగ్రతలు అతి తక్కువగా ఉంటాయి. బాల్టాల్ లో రాత్రి టెంట్ బయటికి వెళ్తే కాళ్ళు చేతులు వంకర్లుపోయేంత చలి. రాత్రి రెండు గంటలకు అందరం  మేల్కొన్నాం. ముందు రోజు రాత్రి మాట్లాడుకున్న

గుర్రాల వాళ్ళు వచ్చి కూర్చున్నారు. టెంట్ వాళ్ళు నీళ్లు వేడి చేస్తూ అందరికి అందిస్తున్నారు. అంత చలిలో ఆ సమయంలో స్నానాదికాలు ముగించుకుని ఎవరి గుర్రం వాళ్ళు ఎక్కి బయల్దేరారు. మొదటిసారి గుర్రాలపై సవారీ ఒక వింత అనుభూతి. కొంత భయం, కొంత ఆనందం. ఆర్మీ చెకింగ్ క్యూ లైన్లో సరిగ్గా ఉదయం 5 గం. లకు చెకింగ్ చేసి పంపించారు. యాత్రికులందరూ "భం భం భోలే" నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అమరనాథ్ ష్రయిన్ బోర్డ్ వారు, యాత్రలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏం ప్రమాదాలు ఎదురవొచ్చు అనే విషయాలు మైకులో చెపుతూ ఉంటారు. వారి సూచన మేరకు గుర్రం నడిపే మనిషి యొక్క ID కార్డ్ తీసుకొని మా దగ్గర ఉంచుకున్నాం. ఒక కిలోమీటర్ తర్వాత ఏటవాలు గుట్టలు మొదలయ్యాయి. ఇద్దరు వ్యక్తులు మాత్రమే నడవగలిగేంత దారిలో ప్రయాణం ఉంటుంది. అదే దారిలో పోయేవారు, వచ్చేవారు, గుర్రాలు, వాటిని నడిపే వాళ్ళు, నడిచి వెళ్లే యాత్రికులు, డోలిలో వెళ్లే యాత్రికులు అందరూ ఒకళ్ళ వెనకాల ఒకళ్ళు వెళ్తుంటారు. ఆ దారిలో వెళ్ళడమే ప్రమాదకరం అంటే గుర్రంపై కూర్చుని వెళ్లడం ఇంకా భయంకరం. గుర్రం ఎలా వెళ్తుందో, ఎక్కడైనా జారడం జరిగితే, కింద అంతులేని లోయలు, ఆలోచిస్తే భయానకం. నడిచి వెళ్ళడమే క్షేమం అనిపిస్తుంది, కానీ అలా ఆ ఎగుడుదిగుడు కొండల్లో నడవలేము, సమయానికి తిరిగి రాలేము. అందుకే కొంత భయమైనా గుర్రాలే నయం. భయపడతాం కానీ గుర్రాలకి, వాటిని నడిపే వాళ్ళకి ఆ ప్రయాణం సాధారణం. కొన్ని చోట్ల ఏటవాలు ఎక్కువ

ఉండడం, దారి బాగా లేకపోవడం వల్ల గుర్రాలు బాగా కష్టపడేవి. మా గ్రూప్ అంతా దాదాపు ఒకరి వెనకాల ఒకరం వెళ్తున్నాం. చుట్టూ ప్రకృతి అందాలు అద్భుతం. గుర్రం మీద కూర్చుని మొబైల్ కెమెరాలో బంధించడం అతి కష్టం. ఏ మాత్రం చేతిలోంచి జారినా మొబైల్ మళ్లీ దొరకదు. మధ్యలో అక్కడక్కడ CRPF వాళ్ల క్యాంపులు, మొత్తం దోవ వెంబడి సైనికుల పహారా, మేము వాళ్ళకి గౌరవ పూర్వకంగా చేతులు ఊపుతూ ముందుకు వెళ్ళాం. కొంత స్థలం ఎక్కువ ఉన్న చోట లంగర్ ఏర్పాటు చేశారు. అక్కడ వనమూలికలతో తయారు చేసే 'ఖావా' అనే ఒకరకమైన తేనీరు తాగి మళ్లీ బయల్దేరాము. మొత్తం ప్రయాణం అంతా కొండ వాలు వెంట సాగుతోంది. మధ్యమధ్యలో మంచు, జలపాతాలు అద్భుతం. ఎటు చూసినా అత్యంత మనోహరంగా ప్రకృతి దృశ్యాలు. లోయలో మంచు కిందనుండి కొండనీటి ప్రవాహాలు, సూర్యకాంతి కి వెలిగిపోతూ వెండికొండలు. ఆ ప్రాంతంలో వాతావరణం ఎప్పుడూ మారుతూ ఉంటుంది, మధ్యమధ్యలో చిన్నగా చినుకులు పడి కొంతసేపటికి ఆగిపోయాయి. వర్షం పడితే కొండల మీదనుంచి రాళ్లు, మట్టిపెళ్లలు కిందకి దొర్లిపడే  ప్రమాదం ఉంది. అక్కడక్కడ ఆ ప్రాంతం సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో వుందో తెలిపే బోర్డులు ఉన్నాయి, ఒక చోట ఎత్తు దాదాపు 13500 అడుగులు ఉంది, బాల్తాల్ కాంప్ కంటే అది దాదాపు 5000 అడుగులు ఎక్కువ ఎత్తు. అలా దాదాపు 11 కిమీ ల దూరం వచ్చిన తర్వాత పహ్లగావ్ వైపు నుండి వచ్చిన యాత్రికులు మాతో కలిశారు. ఇంకో రెండు కిమీ ల తరువాత పవిత్రమైన గుహ ఉన్న

లోయ మొదలవుతుంది.

పవిత్రమైన గుహ ఉన్న లోయ మొత్తం మంచుతో కప్పబడి ఉంటుంది. రెండువైపులా మంచు పర్వతాలు, మధ్యలో నీటి ప్రవాహం, రెండు వైపులా టెంట్లు, లంగర్లు, అత్యంత చలి. లోయ మొదట్లోనే గుర్రాలు దించేశారు, అక్కడి నుండి నడవాలి లేదా డోలి మాట్లాడుకోవాలి. డోలీ సవారీ ధర ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల వరకు ఉంటుంది. గుహ ప్రాంతం సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండడం వల్ల అక్కడ వాతావరణం లో ఆక్సిజన్ తక్కువగా ఉంటుంది, దానివల్ల కొందరు యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. శ్వాస సరిగా తీస్కోలేకపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, తల దిమ్మెక్కినట్టు ఉండడం లాంటి లక్షణాలు కనపడ్డాయి. ఒకరిద్దరు మినహా అందరం డోలీలు మాట్లాడుకున్నాం. కుర్చీని రెండు కట్టెలకు నలుగురు వ్యక్తులు మోసుకుపోయేలా కట్టి, దానిని డోలీ అంటారు. గుర్రాలు ఆపే స్థలం నుండి గుహలో మెట్లు ఎక్కి దర్శనం చేయించుకుని, తిరిగి గుర్రాలు ఆపిన చోట దించేస్తారు. మోసుకుని వెళ్లే వాళ్ళు అందరూ దాదాపు స్థానిక ముస్లింలే, వారి సహకారం లేకుండా యాత్ర చాలా కష్టం. గుహ దగ్గరికి వెళ్ళింతర్వాత ఒక చోట బ్యాగ్, మొబైల్, పర్సు లాంటివి పెట్టి మెట్లు ఎక్కించి డోలీ దించారు. సాధారణంగా గుహ అనగానే కొండగుట్టల మధ్య లోనికి వెళ్ళాలి అనుకుంటాం, కానీ అమరనాథ్ గుహ, కొండను కొంచెం తొలిచినట్టుగా బయటనే ఉంటుంది. ఆక్సిజన్ లోటు ప్రభావం శరీరం మీద అలాగే ఉంది, పూజ సామగ్రి చేతిలో తీసుకుని వరసలో

నిల్చున్నాను. భక్తులు ఒక్కొక్కరిగా దర్శనం చేసుకుంటూ ముందుకు కదులుతున్నారు, పూజారులు వారికి దర్శనం చేయించి అన్నీ వివరించి చెపుతున్నారు. నా వంతు వచ్చింది, పూజారి చెప్తున్నాడు, " ఉధర్ దేఖో భోలే బాబా కో దేఖో, బర్ఫానీ బాబా కా దర్శన్ కర్లో " అంటూ మంచు లింగం వైపు చూయించాడు. కుడి వైపున మంచు లింగాకారంలో అద్భుతంగా ఉంది, పూజా సామగ్రి పూజారి కి ఇస్తూ కనురెప్ప వాల్చకుండా అమరనాథుని తదేకంగా దర్శించుకున్నాను, మనసు పారవశ్యంలో మునిగిపోయింది. జీవితంలో అత్యంత ముఖ్యమైన సంఘటన. దేవుడికి నా మీద ఉన్న కృపను తలచుకుని కళ్ళు చెమర్చాయి. పూజారులు అక్కడ అన్నీ వివరించసాగారు, వాళ్ళ మాటలే నన్ను ఈ లోకంలో ఉంచుతున్నాయి. గుహ గోడలపై తిరుగుతున్న పావురాల జంటను చూపంచారు.

మహాశివుడు పార్వతీదేవి కి జనన మరణ రహస్యములను, అమరత్వమును వివరించడానికి పవిత్రగుహను ఎంచుకున్నారని చెపుతారు. దేవరహస్యం కావున శివుడు దారిలో అక్కడక్కడ తన పరివారమును వదిలి పార్వతీ సమేతుడై పవిత్ర గుహను చేరతాడు. నంది ని వదిలిన ప్రదేశం 'పహల్గావ్' అనీ, శేషనాగు ను వదిలిన ప్రదేశం 'శీష్ నాగ్' అనీ, గంగను విడిచిన ప్రదేశం 'పంచతరణి' అనీ ఇప్పటికీ పహల్గావ్ దారిలో యాత్రికులు విశ్రాంతి తీసుకుంటున్న ప్రాంతాలుగా ఉన్నాయి. అలా మహాశివుడు పార్వతీదేవికి అమర రహస్యం వివరించునపుడు గుహలో ఉన్న ఒక పావురాల జంట కూడా ఆ రహస్యం తెలుసుకున్నవై

అమరత్వమును పొందినాయని చెపుతారు. ఆ పావురాల జంటనే ఇప్పటికీ యాత్రికులకు గుహ వద్ద దర్శనమిస్తుంది, ప్రతి యాత్రికుడూ తప్పనిసరిగా ఆ పావురాలను దర్శించుకుంటాడు.

నుదుటన విభూతి పెట్టుకొని, ప్రసాదం తీసుకుని అక్కడినుండి బయలుదేరాను. డోలీ వాళ్లు లోయ మొదలైన చోట వదిలి పెళ్లారు, గుర్రాలవాళ్ళు మా కోసం వేచి చూస్తున్నారు. ఇంకో ఇద్దరు మిత్రులు రావాల్సి వుండగా మిగిలిన వాళ్లు అక్కడ ఒక టెంట్ లో ఆగారు. నిద్ర సరిగా లేకపోవడం, సరిగా తినక పోవడం, క్లిష్టమైన కొండ ప్రాంత వాతావరణం వల్ల అందరి ఆరోగ్యముగా కొంత దెబ్బతింది. దగ్గర్లోని ఒక లంగర్ లో రెండు పూరీలు తిని, టీ తాగి కొంత విశ్రాంతి తీసుకున్నాం. దినం గడుస్తున్నా కొద్దీ చలి తీవ్రమవుతోంది. అందరూ రాగానే పవిత్రమైన గుహ ఉన్న లోయలోంచి బయటకు తిరుగు ప్రయాణం మొదలు పెట్టాము. ఒక చోట గుర్రాలు అదుపు తప్పడంతో అందరం ఆందోళనకు గురయ్యాం, కానీ అదృష్టవశాత్తూ ఏం ప్రమాదం సంభవించలేదు. తిరుగు ప్రయాణం దాదాపు దిగుడే ఉంది, గుర్రాలు కూడా చాలా అలసిపోయాయి. ఇంకాసేపట్లో చేరుకుంటామనగా వర్షం మొదలైంది కానీ తొందరగా సద్దుమణిగింది, అందరం ఊపిరి పీల్చుకున్నాం. ఎందుకంటే వర్షం పడితే కొండలమీద నుంచి మట్టి రాళ్లు కిందకిపడే ప్రమాదం ఉంది. బాల్తాల్ లో మా టెంట్ కి చేరుకునే సరికి సాయంత్రం అయింది. గుర్రాల వాళ్ళను పంపించేసి, ఇక ఏ మాత్రం ఓపిక లేని స్థితిలో అందరం దాదాపు

నాలుగు గంటలు గాఢమైన నిద్రలోకి జారుకున్నాం. అమరనాథుని దర్శనభాగ్యం లభించిన ఆ రోజు మా అందరికీ ఒక మధురమైన రోజు.

## క్యాంపులో సరదా

మరుసటి రోజు బాల్టాల్ కాంప్ నుండి బయల్దేరి శ్రీనగర్ వెళ్లాల్సి ఉన్నా అనుకోని పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. కాశ్మీర్ లోయలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఆర్మీ వాళ్ళు కాంప్ వదిలి వెళ్ళడానికి అనుమతినివ్వలేదు.

యాత్రికులందరూ ఆ రోజు విశ్రాంతి తీసుకున్నారు. మహారాష్ట్ర నుండి వచ్చిన వాళ్ళందరూ భజనలు, కీర్తనలు చేస్తూ కాలక్షేపం చేశారు. అందరూ టెంట్లలో ఉండడంతో వ్యాపారులు కొందరు రకరకాల వస్తువులు తీసుకొని టెంట్ల వద్దకు రావడం, యాత్రికులు వచ్చి రాని హిందీలో, వ్యాపారులు వచ్చి రాని తెలుగులో బేరాలడడం. స్థానికంగా తయారైన స్వెటర్లు, దేవుని పూజ సామగ్రి, కాశ్మీరీ కేసర్, రకరకాల తైల ద్రవ్యాలు... వ్యాపారులు అమ్ముతూ కనిపించారు.

టెంట్లో సమయం గడవని వాళ్ళు షాపింగ్ వెళ్లారు. కాంప్ లో రోడ్డుకు ఒక వైపు లంగర్లు, ఇంకోవైపు రకరకాల వస్తువులు దొరికే దుకాణాలు. అన్ని వయసుల వాళ్లకోసం బట్టలు, స్వెటర్లు, శాలువాలు, రెయిన్ కోట్లు, జెర్కిన్స్, ఆట వస్తువులు, సుగంధ వస్తువులు, పూజా

సామగ్రి, రకరకాల యంత్రాలు, తాయెత్తులు, అన్ని రకాల రుద్రాక్షలు, పళ్ళు, డ్రై ఫ్రూట్స్ ఇలా ఎన్నో ఎన్నెన్నో వస్తువులు అక్కడ అమ్ముతున్నారు. అదంతా ఒక సంత లాగా ఉండి, యాత్ర జరిగేన్ని రోజులు మాత్రమే ఉంటుంది. వాళ్ల భాషలో 'ఏక్ మహినే కా దుకాన్'. కాశ్మీరీ భాష చాలా భిన్నంగా ఉంటుంది, మన భాషలకు పూర్తిగా భిన్నంగా ఉండి ఏ మాత్రం అర్థం చేసుకోలేని విధంగా ఉంటుంది. అందుకే వారధి అయిన హిందీ భాష అక్కడ చాలా అవసరం.

ఇక మా గ్రూప్ లో అందరం దినమంతా మాటిమాటికీ షాపింగ్ కి వెళ్లి, కొన్నవి కొన్నట్టుగా టెంట్లో పెట్టేస్తూ గడిపేసాం. ఇలా దినమంతా గడిచిన తర్వాత కొన్న వాటికోసం ఉన్న బ్యాగులు సరిపోక ప్రత్యేకంగా బ్యాగులు కొనాల్సిరావడం వల్ల ఒకరి మీద ఒకరం జోకులు వేసుకొని నవ్వుకున్నాం.

అలా రోజు ఆహ్లాదకరంగా గడిచినా, సాయంత్రం అయినా కొద్దీ చలి పెరగడం వల్ల కొంత ఇబ్బందికరంగా ఉండేది.

## బాల్తాల్ కు వీడ్కోలు

దర్శనం అయిన రెండోరోజు ఆర్మీ వాళ్ళు అనుమతి ఇవ్వడంతో తెల్లవారుజామున 4 గంటలకు బాల్తల్ కాంప్ నుండి బయలుదేరాం. టెంట్లో సహకరించిన ముస్లిం సోదరులు వీడ్కోలు

చెప్పారు. 'భం భం భోలే' నినాదాలు చేసుకుంటూ బయల్దేరాము. బస్ లో యాత్రికులు ఒకళ్ళ తర్వాత ఒకరు భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. సూర్యుని వెండి కిరణాలు విస్తరిస్తున్న కొద్దీ కాశ్మీర్ లోయ అందాలు ఒక్కొక్కటిగా అవిష్కృతమవుతున్నాయి. ఆర్మీ క్యాంపులు, అందమైన రిసార్ట్లు, మానవ ఆవాసాలు...

లోయలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా డ్రైవర్ బస్ ను ఎక్కడా ఆపకుండా నడిపిస్తున్నాడు. ప్రతి ఊరిలో చిన్న చిన్న ఇళ్లు కాకుండా, పెద్ద, రెండంతస్తుల భవంతులే ఎక్కువ ఉన్నాయి. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల దాల్ సరస్సు, శికారా షికారు, హౌస్ బోట్ లో బస అన్నీ కూడా వదులుకొని ముందుకు పోవాల్సి వచ్చింది. యాత్రికులందరూ ఈ విషయం గురించి చాలా బాధపడ్డారు. శ్రీనగర్ దాటిన తర్వాత చల్లటి వాతావరణం కాస్తా పొడిగా మారింది. ఒక షాప్ దగ్గర కొంతసేపు ఆగాము, అక్కడ డ్రైఫ్రూట్స్, కేసర్, శిలాజీత్ మొదలగు చాలా వస్తువుల గురించి వాళ్ళు వివరించారు. అందరూ వాళ్లకు కావాల్సిన పదార్థాలు కొనుక్కున్నారు. అవంతిపుర అనే చోట పూర్తిగా కూలిపోయి ఉన్న రెండు ఆలయాల ఆనవాళ్లు కనిపించాయి. ఎందరు శిల్పకారులు ఎన్ని ఏళ్ళు కష్టపడి నిర్మించారో ఆ శిల్పాలను, ఇప్పుడు దీనంగా ముక్కలు ముక్కలై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి నేల మీద. ఆనంతనాగ్ జిల్లాలో దారి పొడవునా క్రికెట్ బాట్ లు కుప్పలుగా పేర్చబడి ఉన్నాయి. ఈ ప్రాంతంలో 'కాశ్మీర్ విల్లో' అనబడే బాట్ లను పెద్ద ఎత్తున తయారు చేస్తారు.

ఒక విషయం అద్భుతంగా అనిపించింది, మా బస్ ప్రయాణిస్తున్న రోడ్డు (NH no 44) కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా భారతదేశ ఉత్తర దక్షిణాలను కలుపుతుంది. మా ఆదిలాబాద్ కూడా ఇదే రహదారి పక్కన ఉన్నది.

యాత్రికులు అంత్యాక్షరి ఆట మొదలుపెట్టారు. ఇక్కడ వృక్ష జాతి, దక్షిణాదికి పూర్తి భిన్నంగా ఉంది. టేకు చెట్టు లాగా ఎత్తుగా పెరిగే చెట్లు విస్తృతంగా ఉన్నాయి, వాటి ఆకులు రాగిచెట్టు ఆకులలాగా ఉన్నాయి. అలా వెళ్తుండగా ఒకచోట ఘాట్ రోడ్డు మొదలయింది, జవహర్ టన్నెల్ దాటాము. ఎడమవైపు మట్టి రాళ్లు కూలి కిందపడేలాగా ఎత్తైన గుట్టలు, కుడివైపు లోయలు, చిన్న రోడ్డు, ఎక్కువ వాహనాలు, కాలుష్యం, మొత్తంగా ప్రమాదకరం. ఈ మధ్యనే ప్రధానమంత్రి గారిచే ప్రారంభించబడిన చేనాని-నశ్రీ టన్నెల్ లోకి బస్ ప్రవేశించింది. దేశంలోనే పొడవైన (9 కి మీ) ఈ టన్నెల్ ఇటీవలికాలంలోని అద్భుతమైన నిర్మాణం. దీనివల్ల జమ్ము మరియు కశ్మీర్ ల మధ్య దూరం తగ్గింది. దక్షిణ కాశ్మీర్ లోని కట్రా అనే పట్టణానికి చేరేసరికి సమయం రాత్రి పది దాటింది.

## శివ్ ఖోరి గుహాలయం

మరునాడు ఉదయం శివ్ ఖోరి అనే చోటికి బయల్దేరాము. అది ఒక శివాలయం, కట్రా నుండి 85 కిమీ లు ఉంటుంది. ఎటు చూసినా పచ్చదనం నిండిన కొండలు, కొండల్లో జనావాసాలు. యాత్రికులు మళ్ళీ భజనలు మొదలుపెట్టారు. బస్ చినాబ్ నదిని దాటింది. స్వచ్ఛమైన తెల్లని నీరు గుండ్రని రాళ్ళను మోసుకొస్తూ అద్భుతంగా ఉంది ఆ దృశ్యం. కొండలూ లోయలే తప్ప మైదాన ప్రాంతాలు చాలా తక్కువ. ఆకుపచ్చని మిశ్రమ అడవి దట్టంగా ఉంది. ఈ కొండ ప్రాంతాల్లో మట్టి, రాళ్లు విరిగిపడడం సర్వసాధారణం.

శివాలయం ఉన్న గుహను చేరాలంటే మూడున్నర కిలోమీటర్ల దూరం నడిచి వెళ్ళాలి. యాత్రికులకు వినోదం పంచడానికి మధ్య మధ్యలో డోలు వాయిద్య బృందాలున్నాయి. గుహ లోపల రెండు దారులు ఉన్నాయి, ఒకటి ఇరుకుగా ఉండి ఎక్కువ దూరం ఉండగా ఇంకొకటి తక్కువ దూరం ఉంది. మేము సులువైన దారిలో లోనికి వెళ్ళాము. అక్కడ గుహ గోడలపై వివిధ దేవతా రూపాలలో సహజంగా ఏర్పడిన ఆకారాలు ఉన్నాయి, వాటిని వివరించడానికి గైడ్స్ ఉంటారు. శివలింగం దర్శనం చేసుకుని కొద్దిసేపు కూర్చున్నాం. ఢోల్ బాజాతో పాటు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెనక్కి వచ్చేశాం.

రాత్రి హోటల్ భోజనహాల్ లో ఉన్నప్పుడు ఒక చెడు వార్త తెలిసింది. ఒక గంట క్రితం అమరనాథ్ యాత్ర ముగించుకుని వస్తున్న ఒక బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఏడుగురు యాత్రికులు చనిపోయారు. అందరం దిగ్భ్రాంతికి గురయ్యాం, బంధువులు స్నేహితులు

ఆందోళనపడి కాల్స్ చేయడం మొదలుపెట్టారు. వార్త టీవీలో చూసాము, చాలా సేపు నిద్ర పట్టలేదు. ఇంకా కొందరు వీడలేక పోతున్నారు, చాలా దురదృష్టకరం.

## మాతా వైష్ణోదేవి

మా యాత్రలో చివరి దర్శనం మాతా వైష్ణోదేవి. ఈ ఆలయం ఎత్తైన కొండమీద ఉన్న ఒక గుహాలయం. యాత్రికులందరూ వేరు వేరు వాహనాల్లో బయల్దేరారు, మేము హెలికాప్టర్ కోసం బయల్దేరాము, టికెట్ ఖర్చు దాదాపు పదిహేను వందల వరకు ఉంటుంది. ఒక గంట వెయిటింగ్ తర్వాత మా వంతు వచ్చింది. ఆ ప్రాంతమంతా మబ్బులు కమ్మి వర్షం పడేలా ఉంది. మా అందరికి హెలికాప్టర్ ఎక్కడం కొత్తే, ఉత్సాహంగా ఉన్నాం. పైలట్ పక్కన ఇద్దరం వెనక సీట్లో నలుగురం కూర్చున్నాం. మెల్లగా హెలికాప్టర్ పైకి లేస్తోంది, కూర్చున్న చోటునుండి ఉన్నపలంగా పైకి లేచాం అందరం, గమ్మత్తైన అనుభూతి. పైకి ఎగిరే అనుభూతి, విమానంలో కన్నా హెలికాప్టర్లో బాగుంటుంది. మా కింది భూమి మాకు దూరమవుతోంది. చెట్లు, రోడ్లు, ఖాళీ స్థలాలు, భవనాలు అన్నీ చూస్తూ పైకి ఎగురుతున్నాం. అన్నీ ఫోన్లో బంధించాలని ఉన్నా, అనుమతి లేక ఊరుకున్నాం. మబ్బులు దట్టమవుతున్నాయి, పైలట్ హెలికాప్టర్ ని వెనక్కి తిప్పాడు, మా అందరిలో ఆందోళన. గుట్ట పైకి పోలేమేమో

అనుకున్నాం, కానీ ఒక రౌండ్ తింపుకుని, మళ్లీ పైకి తీసుకుని వెళ్ళాడు పైలట్. ఎలాగోలా 15 నిమిషాల తరువాత గుట్టపైన దించాడు. కిందకు దిగాల్సిన వాళ్లకు నిరుత్సాహమే ఎదురైంది, వాతావరణ సమస్య వల్ల అప్పటి నుండి హెలికాప్టర్లు నడపలేదు.

హెలిపాడ్ నుండి కూడా ఆలయనికి దూరం ఎక్కువే ఉంది, దాదాపు గంట సేపు కొండ వాలు వెంట నడిచి గుహ దగ్గరికి చేరుకున్నాం. భారీ వర్షం మొదలైంది. గుహ ప్రవేశద్వారం అందంగా అలంకరించబడి ఉంది. అలంకరణ దక్షిణాది లోలాగా పూలతో, ఆకులతో, సహజంగా కాకుండా రంగులు, మెరుపులతో భారీగా భిన్నంగా ఉంటుంది. క్యూ లైన్లో భక్తులందరూ వైష్ణోదేవిని "జై మాతా ది", "మాతా నే బులాయా" అంటూ కీర్తిస్తూ ముందుకు సాగారు. ఒకచోట గుహలోకి ప్రవేశించాము, ఇద్దరు మాత్రమే నడిచేలా ఉంది.  అక్కడక్కడా లైట్లు ఉన్నాయి. గుహ గోడలు టైల్స్ తో అలంకరించబడి ఉండడంవల్ల అది సహజమైన గుహ కాదేమో అనిపిస్తుంది. ఒకచోట అమ్మవారి మూర్తిని దర్శించుకున్నాం, అది సహజమైన ఆకృతి. కొన్ని క్షణాలు తనివితీరా దర్శించుకుని బయటికి వచ్చాం.

అదే కొండపై భైరవుని ఆలయం ఉంది, యాత్రికులు తప్పనిసరిగా దర్శించుకుంటారు. భైరవుని దర్శనంలో ఒక గమ్మత్తు జరిగింది. పైకి కిందకి, ఎక్కడానికి దిగడానికి కొండ వాలు వెంట దారి నిర్మించారు, ఆ దారికి అడ్డంగా పైకి కిందకి మెట్లు ఉన్నాయి, ఓపిక ఉన్నవాళ్లు ఆ మెట్ల దారిలో వెళ్ళవచ్చు. కొండ వాలు దారిలో ఒక చోట భైరవ ఆలయం కి వెళ్ళడానికి 57

మెట్లు అని బోర్డ్ ఉంది, అది నిజమనుకుని అందరం గబగబా ఎక్కేశాం, కానీ ఆ మెట్లు ఇంకొక కొండ వాలు దారి వరకే ఉన్నాయి, మళ్లీ అక్కడి నుండి 110 మెట్లు, సరేలే అని అవి కూడా ఎక్కేసాక ఇంకో 150 మెట్లు ఈ రకంగా దాదాపు 1000 మెట్లు ఎక్కాక భైరవుని ఆలయం వచ్చింది. అందరం ఫూల్స్ అయ్యాం, నవ్వుకున్నాం. భైరవుని దర్శనం చేసుకున్నాం.

హెలికాప్టర్ ప్రయాణం రద్దు అయిందనుకుని తెలుసుకుని, అవే మెట్ల దారిలో నడుచుకుంటూ కొండ దిగాలని నిశ్చయించుకున్నాం. కొండ వాలు వెంట అక్కడక్కడా కొండ చరియలు విరిగిపడే ప్రమాద హెచ్చరికలు, రక్షణ కోసం మొత్తం దారి వెంట ఇనుప కట్టడాలు పైన రేకులతో నిర్మించబడి ఉన్నాయి. యాత్రికులు నడుస్తూ, గుర్రాలపై, డోలీలపై ఎక్కుతూ దిగుతూ ప్రదేశమంతా కోలాహలంగా ఉంది. మెట్లవెంట దిగుతూ దిగుతూ దినమంతా గడిచిపోయింది. మెట్లవెంట యాత్రికుల కోసం పూజా సామగ్రి, పిల్లల కోసం ఆట వస్తువుల దుకాణాలు ఉన్నాయి. మెట్లు దిగీ దిగీ అలసిపోయి ఒక ఎలక్ట్రానిక్ మసాజ్ సెంటర్ లో ఆగాము. కొద్దిసేపు మసాజ్ తర్వాత మళ్ళీ బయల్దేరాము. దాదాపు 2000 మెట్లు దిగిన తర్వాత ఒక హోటల్లో టిఫిన్ చేసి మళ్లీ బయల్దేరాము. భైరవుని గుడికి, అక్కడినుండి కిందకి మొత్తం దాదాపు మూడు వేల మెట్లు దిగీ దిగీ మా సామర్థ్యాన్ని మేమే పరీక్షించుకున్నట్టు అయింది. ఒక ఫోటో స్టూడియోలోకి వెళ్ళాం. ఫోటోగ్రాఫర్ వేషంలో విచిత్రంగా, పనిలో ప్రొఫెషనల్ గా, మొత్తానికి వింతగా ఉన్నాడు. మొత్తం గుట్టకిందకి దిగి ఆటోలో హోటల్ కి

చేరేసరికి రాత్రి పది అయింది.

## ముగింపు

అద్భుతమైన జ్ఞాపకాలనిచ్చిన అమర్ నాథ్ యాత్ర ముగింపు దశకు వచ్చింది. పొద్దున హోటల్ ఖాళీ చేసి దిలీప్ ఠాకూర్ గారి నుండి మరియు ఇతర యాత్రికుల నుండి సెలవు తీసుకుని జమ్మూ కి బయల్దేరాము. ఉగ్రవాదుల దాడుల కారణంగా కాశ్మీర్ అంతా ఉద్రిక్తంగా ఉంది. తొందరగా జమ్ము విమానాశ్రయం చేరాలని ఆ అమరనాథున్ని ప్రార్థించాము. చిన్నగా వర్షం మొదలైంది.  ఒక గంట ప్రయాణం తర్వాత జమ్ము చేరుకున్నాం. శ్రీనగర్ లా కాకుండా జమ్ము సాధారణ నగరంలా ఉంది. విమానాశ్రయం చేరుకుని ఊపిరి పీల్చుకున్నాం. అక్కడినుండి ఢిల్లీ, ఢిల్లీ నుండి హైదరాబాద్ కొన్ని గంటల్లో చేరుకున్నాం.

ఎన్నో మరెన్నో అనుభవాలు, అన్నీ ఇక్కడే ఇప్పుడే ఈ ఒక్క జీవితంలోనే...

***

# ధన్యవాదములు

